సప్తమ సంపుటము.] [దశమ సంచిక.

గ్రంథాలయసర్వస్వము.

ఆంధ్ర దేశ గ్రంథాలయ సంఘ పక్షమున
ప్రకటింపఁబడు మాసపత్రిక.

సంపాదకుఁడు:
అయ్యంకి వేంకటరమణయ్య.

విషయసూచిక

1. గ్రంథాలయాదర్శము.
2. హెర్బర్టు హూవరు.
3. శ్రీ వాణీవినోద గ్రంథాలయము, మద్రాసు.
4. ప్రశంసా పద్యములు.
5. మద్రాసు గ్రంథాలయ సంఘము.
6. శ్రీ ఆంధ్రమహాజనసంఘము, మోల్మేన్ (బర్మా).
7. శ్రీ వివేకానంద గ్రంథాలయము, అనంతవరం.
8. శ్రీ సరస్వతీనిలయము, తిరుత్తణి. (చిత్తూరు జిల్లా)
9. ఉచితము.

బెజవాడ: ఆంధ్ర గ్రంథాలయ ముద్రాక్షరశాలయందు
క. కోదండరామయ్యగారిచే ముద్రింపఁబడి ప్రకటింపఁబడినది.

వార్షికమూల్యము రు ౧-౮-౦.] [విడిసంచిక వెల రు ౦-౨-౦

CD

అచ్చునకు సిద్ధముగానున్న గ్రంథములు

మానవధర్మదర్శిని.

ఇటలీ దేశ భక్తాగ్రేసరుడగు "మాజినీ" మహాశయుని గ్రంథము ననుసరించి, శ్రీ శ్రీ శ్రీ యోగి తత్త్వానందస్వామి బి ఏ., గారిచే రచియింప బడినది. "మాజినీ" మహర్షి పుంగవుని యొక్క విపులమగు జీవిత చరిత్రముగూడ చేర్చబడినది.

౨. డచ్చిప్రజాస్వామిక ప్రారంభము.

దేశభక్త కొండ వెంకటప్పయ్యగారిచే రచింపబడినది.

౩. ఫ్రెంచి స్వాతంత్ర్యవిజయము.

ద్వితీయ భాగము.

అయ్యదేవర కాళేశ్వరరావుగారిచే రచియింపబడినది.

౪. బీజగణితము.

కొమరాజు లక్ష్మణరావుగారిచే రచియింపబడినది.

రాష్ట్రేతరాంధ్రులు.

రాష్ట్రేతరాంధ్రులందు ఆంధ్రత్వము స్థిరత్వము వహించునటుల జేయుటకును, ఆంధ్రోద్యమప్రచారము గావించుటకును, ఆంధ్రులకును, ఇతరజాతులవారికిని, పరస్పరసోదరభావము పెంపొందించుటకును, రాష్ట్రేతరాంధ్రుల సాంఘిక కార్యక్రమముల నెల్ల కేంద్రీకరించుటకును నిరంతరకృషి చేయు ఆంధ్రమాసపత్రిక. సంవత్సర చందా ఒకరూపాయి మాత్రమే.

చిరునామా:—

ఆంధ్రజనసంఘ గౌరవకార్యదర్శిగారు, ఖరగపురము.

RSVM01A 139

గ్రంథాలయ సర్వస్వము.

సంపు. ౨. | బెజవాడ - ఏప్రిల్ ౧౯౨౯. | సంచిక. ౧౦

గ్రంథాలయాదర్శము.

ఉయ్యూరునందున్న
శ్రీ దేశోద్ధారక ఆంధ్రభాషానిలయ వార్షికోత్సవ సందర్భమున
శ్రీ చెరుకుపల్లి బుచ్చిరామయ్యగారిచే
నొసంగబడిన అధ్యక్షోపన్యాసము.

పూర్వకాలమున మన దేశమందంతటను విద్యావ్యాపకము ఆచార్యులవలనను అంతేవాసులమూలమునను జరుగుచుండెడిది. అట్టి యాచార్యు లున్నచో వేరే గ్రంథాలయావశ్యకతయే లేదు. ఆచార్యులే చరమరూపమున నుండు గ్రంథాలయము లనవచ్చును. అనేక గ్రంథములను ఆచార్యులు ధారణజేసి యుండెడివారు. ఏ విషయము కావలసియున్నను వారివలన వినవచ్చును. వేద వేదాంగములు మొదలు సమస్త గ్రంథములలో నుండు విషయములు వారి ముఖమున తెలియ నవకాశము లుండెడివి. కావున అట్టి యాచార్యులను పోషించి వారి సపర్యలజేయుట గ్రిహస్థుల విధ్యుక్త ధర్మ మని యెంచెడివారు. అట్టి యాచార్యు లుండుకాలమున ఆచార్యగృహమే విద్యాలయము. ఆచార్యులే గ్రంథాలయము. అంతేవాసులే విద్యార్థులు. ఇంటివార లందరు గృహకృత్యములైన తరువాత నొకచో కూర్చుండి ఇహపర సుఖసాధనముల గూర్చి ముచ్చటించుచుండెడివారు. లేదా పురాణములు పఠించెడివారు. అవియే సభలు. ఇందు స్త్రీలు పురుషులు పాల్గొను

చుండువారు. కొందఱుస్త్రీలు ప్రత్యేకము విద్య నభ్యసించెడివారు. కొందఱు విద్య నభ్యసింపకపోయినను శ్రవణముచేతనే విద్యావిషయముల దెలిసికొని వివేకవృద్ధి గావించు కొనుచుండెడివారు. బృహదారణ్యమున వినబడు గార్గి, మైత్రేయి మున్నగు విదుషీమణులచరిత్రములే ఇందుకు తార్కాణము.

ఆకాలమునకు తర్వాత క్రమముగ దేశమున మార్పులు గానుపించెను. క్రమక్రమముగ నాకట్టుబాట్లు సడలెను. ఆచార్యు లరుదైరి. అంతేవాసులంతకన్న నరుదైరి. కావున చరమరూపమున నుండు గ్రంథాలయములు స్థిరరూపము దాల్చవలసివచ్చెను. ఋషులయనుభవములు, విద్యావిధానములు, చర్చలు, ప్రయోజనములు, గ్రంథస్థములు చేయబడెను. ఋషుల మొదలు కొంతకాలము క్రిందటివరకు గ్రంథ రచనమన్న చాల భయపడువారు. ఏకదీక్షతో నొక్కొక్కరు తన జీవితమంతయు గ్రంథరచనమున వినియోగించెడివారు. ఒకరు గ్రామమున రోళ్ళవద్ద పడిన కణముల భుజించి తర్కశాస్త్రమును రచించెనట. ఇంకొకరు నీరుత్రావుచు గ్రంథముల రచించెనట. వేరొకరు వాయుభక్షణమాత్రము జేయుచు గ్రంథములు రచించిరట. వాచస్పతిమిశ్రులను నొక పండితులుండెడివారు. కాళిదాసాది సంస్కృతకవులు, నన్నయ తిక్కన పెద్దన పోతనాది యాంధ్రకవులు, మొదలగు పండితులెంతెంత శ్రమపడి గ్రంథములు రచించిరో చూడుడు. మహామహులు రచించిన గ్రంథము లపూర్వయనుభవములతో నిండినవి. ఇట్టి గ్రంథములు చేర్చియుంచినవి గ్రంథాలయములు. గ్రంథాలయములు కేవల గ్రంథముల సమకూర్చిన సప్రయోజనము. త్రిపుటికావలయు. గ్రంథములు ప్రజలు చదువు త్రిపుటి. గ్రంథము లున్నను లాభము లేదు. ప్రజలున్నను లాభములేదు. గ్రంథములను చదువరులు చదివి, వానియందున్న యమూల్యోపదేశముల దెలిసికొని, ఆయాదేశము ననుసరించి,

తమతమ వర్తనముల సవరించుకొనవలయును. మన వర్తనములు చిత్తములయం దుండు పూర్వవాసనల ననుసరించి నడుచుచుండును. పూర్వవాసనలు సువాసనలు, దుర్వాసనలు అని రెండువిధములు. దుర్వాసనలను దహించవలయును. సువాసనలను వృద్ధినొందించవలయును. అయ్యది గ్రంథపఠనమువల్లను, సత్సంగమువల్లను సులభము. మనసంఘ మీకాలమున ననేక బాధల నొందుచున్న మాట వాస్తవమే. కాని బాధల తొలగించుకొనుటకు వివేకాభివృద్ధి కావలయును. వివేకమను వెలుగుతో విమర్శించ వలయును. శాస్త్రీయాచారములన్నంతనే మూఢాచారము లని యులికిపడ నక్కరలేదు. హేతువులు దొరకుట లేదుగనుక మే మాచరించ మన నక్కరలేదు. ఆర్షేయ గ్రంథముల జెప్పబడిన నుడువులు అనుభవపూర్వకములైనవి. అతీంద్రియజ్ఞానగమ్యములు. శ్రుతిస్మృతి చోదితములు. ఆయా దేశములకు హేతువులు కన్పడవచ్చును. కన్పడకపోవచ్చును. హేతువిమర్శనము విపరీత పరిస్థితులలో దింపును. సన్నిపాత జ్వరపీడితు డగువాడు మందు పుచ్చుకొనుమన్న- మం దేమిటి, యేపదార్థములతో జేసినారు, ఎట్లు పని చేయును, శరీరతత్వమేమి, ఏ పదార్థ మేధాతువుపై పనిచేయును? అని విమర్శింప నారంభింప నతనికి శారీరశాస్త్రము, వైద్యశాస్త్రము బోధపడుట యెప్పుడు? విశ్వాసము కలుగుట యెప్పుడు? ఔషధము సేవించుట యెప్పుడు? ఆరోగ్యవంతు డగుట యెప్పుడు? మనయాచారముల గూర్చి విమర్శించుటయు నిట్టిదియే యగును. అన్నిటికిని హేతువులు కలవు. అన్నిటివలనను లాభములు కలవు. అన్నియును మన శ్రేయస్సును గూర్చి నియమింప బడినవే. కావున వివేకముతో మెలగ వలయు. సంఘమంతయు సంకటస్థితియం దున్నది. పూర్వపు ఔన్నత్యము మరచితిమి. భావ్యౌన్నత్యము గోచరించుటలేదు. సాధనములనేకములై సాధకులమనంబుల ప్రమాదము నొందించుచున్నవి. ఈ దేశపు టరణ్యమార్గములవలె, కొన్ని గహనారణ్యములలోకి జేర్చును. కొన్ని భయంకర మృగముల కెదుట నిల్పును. కొన్ని తస్కరులుండు

ప్రదేశములలో ప్రవేశపెట్టును. కొన్ని ఎంతతిరిగినను గమ్యస్థానము నకు జేర్చనే లేవు. ఇట్లున్న సాధనములలో నేది పరమానధికి జేర్చునో యోజించుటకు వివేకము కావలయు. వివేకము విద్యవలన కలుగును. విద్య సంకల్పముచే నారబ్ధమై ఆచార్యోపదేశముచే నుజ్జీవితమై సత్సంగముచే వృద్ధినొంది, సంఘసేవచే ప్రకాశించి, భగవదారాధనచే ప్రజ్వలించి, యజ్ఞానధ్వాంతము నంతమొందించును. కావున నట్టి విద్యావ్యాపనముకొరకై యారంభింపబడి యీ భాషానిలయము సర్వులచే పోషింపబడతగినది. ఏ సంస్థయైనను ఒక వ్యక్తిసంకల్పముచే నారంభింప బడును. ఆవ్యక్తి సౌజన్యాదులే యితరులసాయము నాకర్షించును. ఆసాయమువలన కలిగిన బలముచే సంస్థ నిర్వహింపబడును. ఏసంస్థ ఏదేశమున ఏకాలమున నిర్వహింపబడునో ఆదేశము కాలము ప్రజలు మొదలగు పరిస్థితుల ననుసరించి నిర్వహింప బడవలయును. ఇక్కడ పరిస్థితులు మీకే బాగుగ తెలిసియున్నవి. దేశమున నితర భాగములకంటె నీ ప్రాంతము విశేషించి వెనుక బడియున్న దనుట నిర్వివాదాంశము. అయినను యిట్టిస్థలమున నీ సంస్థను పోషించుట యాశ్చర్యము. దీనికి స్థిరభవనము, స్థిరవసతి యేర్పడవలసియున్నది.

మీసంస్థకు మీరు సాయపడుదురేని యితరులు సాయపడుదురు. పూర్వము గ్రంథాలయములు దేవాలయములందుంచెడివారు. 'శివపుస్తకనిక్షేపః బహుపుణ్యఫలప్రదః' అని సూతసంహితాది గ్రంథములయందు జెప్పబడియున్నది. పుస్తకదానము జ్ఞానదాయక మని స్మృతులు బల్కుచున్నవి. కావున పుస్తకముల నిండు. భవననిర్మాణమునకు తోడ్పడుడు. గ్రంథముల పఠించుడు. వార్తాపత్రికల చిలకింపుడు. వివేక మార్జింపుడు. జ్ఞానులు కండు. సుఖింపుడు.

శ్లో॥ ఘృతమివపయసేనిగూఢం। భూతేభూతేచ వసతివిజ్ఞానం।
సతతంమంథయితవ్యం । మనసా మంథానభూతేన॥

హెర్బర్టు హ్యూవరు.

అమెరికాదేశమందు గ్రంథాలయోద్యమమునకై విశేష పరిశ్రమ జేసినవారిలో హెర్బర్టు హ్యూవరు అను మహనీయు లొకరు. ఆయన ౧౮౯౫వ సంవత్సరమున స్టేన్‌ఫోర్డు విశ్వవిద్యాలయమందు పట్టపరీక్షయం దుత్తీర్ణు డాయెను. ఆయన వృత్తి గనులయింజనీరుపని. బీదలకు సహాయము జేయుపనియం దాయనకు ప్రీతి మెండు. ఇంకను ప్రజోపయోగములగు పెక్కుకార్యములం దాయన ఎక్కువశ్రద్ధను దీసికొనుచుండెను. ఇన్ని పనులున్నను, గ్రంథసమీకరణమందును, గ్రంథాలయాభివృద్ధియందును ఆయనకున్న ఆసక్తి అసమానము. అపూర్వగ్రంథములు కావలసిన పరిశోధకులకు ఆయన చేసిన సహాయము వర్ణనాతీతము.

ఆయన చైనాదేశమం దున్నప్పుడు ఆ దేశచరిత్రకు సంబంధించిన వాఙ్మయము బహుస్వల్పముగా నున్న సంగతిని గుర్తించి, దానికి కావలసిన సాధనసామగ్రినంతను విశేష వ్యయప్రయాసలకు లోనై సేకరించి, పిమ్మట దానినంతను "స్టాన్‌ఫోర్డు" విశ్వవిద్యాలయ గ్రంథాలయమున కొసంగెను. ఆయన సేకరించిన సాధనసామాగ్రి అమూల్యమగు పరిశోధనకు ప్రాతిపదిక యయ్యెను.

ఆయన స్వంతగ్రంథాలయమునుకూడ సేకరింప గడంగెను. గనులుత్రవ్వు శాస్త్రము, లోహములకు సంబంధించిన శాస్త్రములకు సంబంధించిన అనేక అమూల్యగ్రంథములను ఆయన స్వంత గ్రంథాలయమునకు సేకరించెను. అభిమానశాస్త్రమగు గనులుత్రవ్వు విద్యయందు ఆయన పరిపూర్ణ ప్రజ్ఞావంతు డాయెను. "స్వీడనుబర్గు" అను కవివర్యుడు వ్రాసిన వేదాంతగ్రంథములు ప్రసిద్ధములు. కాని ఆకవి గనులుత్రవ్వు విద్యయందును, లోహశాస్త్రమందునుగూడ అధికారి. ఆయనకు తెలిసిన పశ్చిమ, ఉత్తర ఐరోపాదేశమందుగల గనులను గూర్చి తనగ్రంథములందు పలుస్థలములందు వివరించెను. ఈ గనులలో

చాలభాగము అనేక శతాబ్దములనుండి పనిచేయకపోవుటచే మూలబడిపోయినవి. అంతేగాదు. అవి ఎక్కడనున్నవో ఎవ్వరికిని దెలియదు. మన కథానాయకుడగు "హూవరు"గారు "స్వీడనుబర్గు" వ్రాసిన గ్రంథములనెల్ల శ్రద్ధతో పరిశీలించి, మూలబడిపోయి అవిఉన్న స్థలముకూడ తెలియబడకఉన్న గనులనన్నిటిని పైకిదీసి, ఆదేశమునకు అనంతమగు మహోపకారమును గలిగించిరి.

హూవరుగారిభార్య భూగర్భశాస్త్రమందు పట్టపరీక్ష నొందెను. లాటిన్ భాషయందు లోహశాస్త్రమునుగూర్చి గల ప్రాచీన ఉద్గ్రంథము నొకదానిని ఆయన తనభార్యసహాయముతో మిక్కిలి పరిశ్రమజేసి భాషాంతరీకరించెను. లండనునందు ప్రకటింపబడిన ఈ భాషాంతరీకరణము ఇప్పుడు అపరూపముగా నున్నది. అయినను పరిశోధకులెల్ల దానికొరకు అత్యాతురులై సంపాదించెదరు. ఆ భాషాంతరీకరణమును ఇప్పుడు జర్మను భాషలోకి పరివర్తింప ప్రయత్నములు జరుగుచున్నవి.

ఆయన అనేక అమూల్య అముద్రిత పండితగ్రంథములను సేకరించి తుదకు "స్టాన్‌ఫోర్డు" విశ్వవిద్యాలయ గ్రంథాలయమునకు ఇచ్చివేసెను.

ప్రపంచకము నంతను అల్లకల్లోలముజేసిన ఐరోపామహాయుద్ధమునుగూర్చిన పరిశోధనక సాధనములన్నియు "స్టాన్‌ఫోర్డు" విశ్వవిద్యాలయమునం దేర్పరుపబడిన "హూవరు యుద్ధగ్రంథాలయము"నందు గలవు. ఈ గ్రంథాలయమునకు ప్రాతిపదికగ నేర్పడిన పరికరములు సేకరించుటకు రు 1,50,000 లు వ్యయమయ్యెను. యుద్ధసమయము నందు 53 దేశములవారు ప్రకటించిన ప్రకటనములన్నియు ఇందు సేకరింపబడెను. సుప్రసిద్ధ భాషాసేవకు లనేకమంది అపూర్వములగు వ్రాతప్రతులను సేకరించి, ఈ గ్రంథాలయమున కొసంగిరి.

ముద్రిత అముద్రిత గ్రంథములేగాక, యుద్ధసమయమందును, దానికి పూర్వమందును ప్రకటింపబడిన ముఖ్యములగు పత్రికలన్నిటిని ఈ గ్రంథాలయమునకు సేకరించిరి. 1914 సంవత్సరము మొదలు 1919సంవత్సరము వరకుగల యుద్ధమునకు సంబంధించిన గ్రంథములుగాని, కరపత్రములుగాని, పత్రికలుగాని, పండితవాఙ్మయముగాని, ఈ గ్రంథాలయమందు సంపూర్తిగా గలవు. మరేగ్రంథాలయమందును ఇంతసంపూర్తిగా లేనేలేదని జెప్పవచ్చును. బెల్జియం, ఫ్రాన్సు, జర్మనీ, గ్రేటు బ్రిటను, హాలండు, రష్యా, సిట్జర్ల్యాండు, యూనైటెడ్ స్టేట్సు - దేశములందలి ప్రధాననగరములయందు ప్రకటింపబడిన దినపత్రికలయొక్క బైండు చేయబడిన సంపుటములన్నియు ఈగ్రంథాలయమందు గలవు.

ఈగ్రంథాలయమందు 65,000 గ్రంథసంపుటములు గలవు. ఇవిగాక పత్రికాసంపుటములును కరపత్రములును గలసి 65,000 ఉండును. ఐరోపా మహాయుద్ధచరిత్రనుగూర్చి పరిశోధన గావింపదలంచినవారెవ్వరైనను ప్రపంచమునందేభాగమునందున్నను ఈ గ్రంథాలయమును దర్శింపక తప్పదు. హూవరు మహాశయుని పరిశ్రమా ఫలితమే ఈ గ్రంథాలయ మని వేరుగ జెప్పవలెనా! ఆ మహనీయుని నామము తర తరములవరకు వన్నెకెక్కగలదు.

శ్రీ వాణీవినోద గ్రంథాలయము, మద్రాసు.

౧౯౨౮ సం॥ జనవరినెలయందు ఈ గ్రంథాలయము స్థాపింపబడినది. ౫౦౦ గ్రంథరాజములున్నవి. జార్జి టౌనులో గోడవునువీధి యందు నెం. 1-34 రు ఇంటియందు పెట్టబడినది.

బెజవాడ
శ్రీరామమోహనధర్మపుస్తకభాండాగార

పదునెనిమిదవ వార్షికోత్సవసమయమున
చదువబడిన

ప్రశంసాపద్యములు

మ॥ ధనవిద్యా విభవాదికంబులను స♦త్యంబీవు మాకిచ్చుచుం
డిన కాసీ, సుకలావిశేషముల బల్ ♦ ఠీవిక విడంబింపగా
ననువై వాణికివాసమై విబుధశ్లా♦ఘ్యంబైన శ్రీరామమో
హన గ్రంథాలయ మీవుబ్రోవవలె స♦మ్మా! హేమదుర్గాంబికా!

సీ॥ ఏమహామహుని స♦త్ప్రేమాతిశయమున
గ్రంథాలయమ్ములు ♦ ప్రభవహించె
ఏప్రాజ్ఞు దినపత్రి♦కా ప్రబోధంబున
ప్రజల యజ్ఞానంబు ♦ బాయుచుండె
ఏ భక్తవర్యుని ♦ శ్రీ భారతీసేవ
పండితాళికి మోద ♦ భరితమయ్యె
ఏ దానకర్ణు మ♦హోదారమతి సర్వ
సంస్థలు వర్ధిల్ల ♦ జాలనేర్చె

గీ॥ అట్టి శ్రీకాశినాథువం♦శాబ్ధి విధుడు
బుధుడు నాగేశ్వరుండు సం♦మోదమంది
వచ్చి నీసభ కధ్యక్ష♦పదవి బూనె
రామమోహన లైబ్రరీ ♦ నామజనని!

సీ॥ ఈవిద్యపొత్తమ్ము ♦ లింటికిం గొనిపోయి
యెందఱో సతులు ప♦ఠించుచుండ్రు
నీసన్నిధికి వచ్చి ♦ నిత్యంబు పత్రికల్
ముదమంది పూరుషుల్ ♦ జదువుచుండ్రు
ఏ మహాసభ నేని ♦ యిచ్చోటనే సల్పి
పౌరులు సంతృప్తి ♦ వడయుచుండ్రు
ఏ మహాత్ముడుకూడ ♦ నీపురి కరుదెంచి
నిన్ను గూర్చియె చాల ♦ సన్నుతించు

గీ॥ అనుదినమ్మును విద్యార్థు ♦ లాసపడెడు
జ్ఞానఫలముల నిడు కల్ప♦శాఖ వగుచు
మించ జగదేకసత్కీర్తి ♦ గాంచితమ్మ
రామమోహన లైబ్రరీ♦నామ జనని!

సీ॥ ఆంగ్లభాషపఠించి ♦ ఆరి తేరెన న్యాయ
వాదులకు న్యాయ♦వాదియయ్యె
జ్యోతిషపండిత♦చర్చలం జర్చించి
నేర్పరియై మేటి♦తీర్పు దీర్చె
కులగోత్ర గరిమంబు ♦ దెలియ వైశ్యాళికి
ధర్మదీపికనొండు ♦ తగ రచించె
విద్వజ్జనుల్ కవుల్ ♦ వేయినోళ్ళ నుతింప
దేవిభాగవతంబు ♦ తెనుగు జేసె

గీ॥ ధీరు డనగను సుందరా♦కారు డనగ
నిపుడు ఛాయాపటాకృతి ♦ నెలమి నిలిచె
దాసు శ్రీరామపండిత♦ధన్యుడిందు
రామమోహన లైబ్రరీ ♦ నామ జనని!

సీ॥ ఒకపూట సత్కళా • యుతులైన పండిత
సద్గోష్ఠిచే ప్రొద్దు • జరపియుంట
ఒకనాడు సత్కవి • ప్రకరముల్ మెచ్చగా
స్వీయకృతుల్ విన్కి • సేసియుంట
ఒకవేళ మిత్రులౌ • నుద్యోగసమితితో
ముచ్చటలతో ప్రొద్దు • పుచ్చియుంట
ఒకట జమీందారు • లురుభక్తి నరుదెంచి
అడిగిన సలహాల • నుడివియుంట
గీ॥ పండితుండన, కవియన, • పంతు లనగ
రావన, యమాత్యుడన జనుల్ • వేవిధాల
పలుకతగి దాసు శ్రీరామ • పండితుండు
కీర్తితోడ ఛాయాపటా • కృతిని వెలసె॥

సీ॥ అజ్ఞానతిమిరమ్ము • లడగింపజాలిన
యర్కబింబంబు గ్రం • థాలయంబు
ఆనందదాయక • మౌ ప్రసంగము నేయు
ఆప్తమిత్రంబు గ్రం • థాలయంబు
సంశయవిచ్ఛేద • సామర్థ్యముంగన్న
ఆచార్యకంబు గ్రం • థాలయంబు
గ్రంథరూపంబున • రహిప్రకాశించు వా
ణీలలామంబు గ్రం • థాలయంబు
గీ॥ అట్టి గ్రంథాలయంబుల • కన్నిటికిని
ఘనశిరోభూషణం బన • గ్రాలు రామ
మోహన గ్రంథనిలయంబు • బ్రోవుడయ్య
పరమకృపతోడ బెజవాడ • పౌరులార!

—ప్రతాప వేంకటేశ్వరకవి.

(2)

మునధర్మాభిరతుల్ ప్రపూర్ణ ఫణితోద్భూత ప్రమోదాంత రా
త్మ నిగూఢాంచితులై కళానిరతులై స్థాపించి రీదివ్యసీ
మను విద్యాసముపార్జనార్థిజన సంపన్మూల మీ రామమో
హన గ్రంథాలయముల్ కృతజ్ఞులము మే మవ్వారి కవ్వారిగన్.

ఇరువది యించుమించుగ గడించు వసంతము లన్ని ప్రాయపు
న్సరువము సూపఁబోదని తనంత నలంకృతశూన్యమై దిగం
బరయయి దృష్టి కానని యుపాస్యవిధిన్ బరితాపమిచ్చె, ఉ
ద్ధరణకళా ప్రదీపకుమత మ్మది చూచియటంచుఁ దోఁచెడిన్.

పాడిబాన గ్రంథాలయ మేరు నిల్పి
నారో? దివ్యముహూర్తమ్మునందు దొల్లి;
నాటఁగోలె సుధాపరిపూర్ణమ్ము గాఁగఁ
దనరినది నేటిదనుక — మీఁదట నెటుండో?

తమ ప్రేమైక సుధార్ద్రమానసము సద్ధర్మ ప్రతిష్ఠాపకా
ర్యములం దాసవహించు నంచుఁ బలుకన్ బ్రాల్మాలగా నేల? స
ర్వము దేశార్పణజేయ-సంస్థ యిది మీవాదోడు చేదోడుకై
మమతన్ గోరె; త్వదీప్సితమ్మును ఫలింపన్ జేతె నాగేశ్వరా!

దేశోద్ధారక గ్రంథమాలలు జగద్విఖ్యాతమై యొప్పఁగా
దేశోద్ధారక పాఠశాలలు భవద్దివ్యన్మహాదార్య రా
కాశుభ్రప్రభ లల్లగా మనము వేడ్కన్ జెందగా నీక ఓ
దేశోద్ధారక! సంచరించు టది నీకున్ లక్ష్యమై యొప్పదే!

పలుపురు ధార్మికోత్తముల ప్రాపున నాకృతి దాల్చి, పూర్తి కా
వలసిన భాగ్యరేఖ తమపై నిడె నీ గృహలక్ష్మి; సంతతో
జ్జ్వలకవితావిహారుల ప్రసన్నమనోహర రూపమై జగ
ద్విలసితమై తలిర్ప నెటు దిద్దెదవో కొ రమాధురంధరా!

సౌధరాజమ్ము లాంధ్రభూస్థలినిఁ జాటు
భవ దుదార నామాంకిత ప్రతిభ - అందు
రామమోహనగ్రంథాలయామతల్లి
ఒకటి చాలును నీ దానవిస్తృతికిఁ దోడు.

వేడికొనంగ నీయఁ దల పెట్టెడు ధర్మపరుల్ గలారుగా
కేడను వేడికోక మునుపే గ్రహియించుచు నర్థి కీయు మీ
జాడలు శాశ్వతాంకిత విశాల హృదంతరదీప్తికిన్ కళా
పౌర్ణిమ జూపు జూడగలవారలు గల్గిన దానవర్థితా!

ఆదిభిక్షుకుం డపార్యసన్నుతిగను
ధనదుఁడవని యర్థిజనము సేరు;
ధర్మసంస్థ యిద్ది ధర్మపరుండవు
ధర్మ మడుగ నేల దలఁచికోఁగ?

—తుర్లపాటి గోవర్ధనరావు.

మదరాసు గ్రంథాలయసంఘము.

ఈ సంఘముయొక్క ప్రథమవార్షిక నివేదిక చేరినది. 1927 సంవత్సరమున డిశంబరు నెలయందు మదరాసునగరమున అఖిల భారత గ్రంథాలయసభ జరిగినదిగదా. ఆసభాఫలితముగ మదరాసు గ్రంథాలయ సంఘమును స్థాపించుటకుగాను అఖిల భారత గ్రంథాలయ సంఘ కార్యదర్శి యగు అయ్యంకి వేంకటరమణయ్యగారు కె. వి. కృష్ణస్వామి అయ్యరుగారి ఇంటియందు ఒక సమావేశమును సమకూర్చిరి. ఆసమావేశ ఫలితముగ ఈసంఘము ఏర్పడినది.

ఇప్పు డీ సంఘమునందు 417 మంది సభ్యులు గలరు. మద్రాసునందు కార్పొరేషనువారిచే ధర్మగ్రంథాలయములు పెట్టించుటకై ప్రయత్నములను జేసిరి. మునిసిపాలిటీలను, లోకలుబోర్డులను ధర్మగ్రంథాలయములను స్థాపించవలసిన దని కోరిరి. డిండిగలు, కర్నూలు పాలంకోట మ్యునిసిపల్ సంఘములు ధర్మగ్రంథాలయములను స్థాపించుటకు తీర్మానములను జేసినవి. రామనాధ తాలూకాబోర్డువారు గ్రామ గ్రంథాలయములకు దోడ్పడుచున్నారు. చెంగల్పట్టు డిస్ట్రిక్టు బోర్డువారు గ్రామగ్రంథాలయ పద్ధతిని స్థాపించిరి. దేశభాషలందలి గ్రంథముల పట్టికలను తయారుజేయుటకై అరవము, కన్నడము, మళయాళము, ఆంధ్రము, ఉర్దూ భాషలకు వేర్వేరు ఉపసంఘములను నియమించిరి. అరవ మళయాళ భాషలకు పట్టికలు పూర్తిగావచ్చినవి. అవి పూర్తికాగానే ప్రకటింపబడగలవు.

మద్రాసునందు కేంద్ర గ్రంథాలయము నొకదానిని స్థాపించుట అవసర మని కనిపెట్టబడినది. దానికి ఫలితముగ మద్రాసునందున్న కన్నెమ్మరాగ్రంథాలయమును కేంద్రగ్రంథాలయముగా మార్పించు ప్రయత్నములు జేయబడుచున్నవి. గ్రంథాలయాభిప్రాయమును వ్యాపింప జేయుటకు గాను 10 మహాజన సభలు సమకూర్చబడెను.

కలకత్తాయందు జరిగిన 6 వ అఖిల భారత గ్రంథాలయసభకు ఒక ప్రతినిధిని పంపిరి.

ఈ వత్సరమందు రూ 5,972-9-2 లు వసూ లయ్యెను. ఖర్చు రు 813-14-0 మాత్ర మయ్యెను.

శ్రీఆంధ్రమహాజనసంఘము, మోల్మేన్. (బర్మా)

ఈపురమున ఆంధ్రమహాజనసంఘము నాల్గేండ్లక్రిందట స్థాపించబడి సర్వాంధ్రజనోపయోగార్థమై పాటుబడుచున్నది. ప్రస్తుతము సంఘముయొక్క పోషణక్రింద ఒక పగటిపాఠశాల, ఒక రాత్రిపాఠశాల, ఒక పుస్తకభాండాగారము నిర్వహింపబడుచున్నవి. పుస్తకభాండాగారము దినదినప్రవర్థమానమై పెక్కుమంది చదువరుల నాకర్షించుచున్నది. ఐదువందల ఆంధ్రాంగ్లేయ గ్రంథములు గలవు. 20 పత్రికలు వచ్చుచున్నవి.

ఈసంఘాధ్యక్షులైన పరిమి సోమరాజుగారు రెండువందలరూపాయలకుపైగా విలువగల మూడు అద్దపుబీరువాలను, కుర్చీలను, పెద్ద గోడగడియారమును దానము గావించిరి. పలువురు గ్రంథాలయాభిమానులు విరివిగా గ్రంథముల నొసంగి సహాయముచేసిరి. అభిమానులెల్లరకును పోత్సాహపరచెదరుగాత.

—పోతుల సుబ్రహ్మణ్యం, లైబ్రేరియన్.

శ్రీ వివేకానంద గ్రంథాలయము, అనంతవరం.

గుంటూరుజిల్లా నర్సారావుపేట తాలూకా అనంతవర గ్రామమునందు ది 15-6-1925 తేదీన "శ్రీ వివేకానంద గ్రంథాలయము" స్థాపింపబడినది. ప్రప్రథమమున 250 గ్రంథములతో స్థాపింపబడి నేటికి షుమారు 1000 గ్రంథరాజములతో విరాజిల్లుచున్నది. నాలుగు పెద్ద యద్దపు బీరువాలు గలవు. 17 పత్రికలు వచ్చుచున్నవి. 20 మంది చందాదారులు గలరు. వారివలన నెలకు రు 10 లు వసూలగుచున్నవి.

గ్రామమునుండి ఎగుమతి అన్నిరకపు సరకులమీద సంవత్సరమునకు షుమారు రుసుము రు 200 ల వరకు వచ్చుచుండును. చందాధనము పత్రికలు తెప్పించుటకును, రుసుములవలన వచ్చు నాదాయము గ్రంథములు తెప్పించుటయందును వినియోగింపబడు చున్నది. గ్రంథాలయమునకు వచ్చు నాదాయమునుండి యవసరమగుచో ధర్మకార్యములకు కూడ వినియోగింపబడుచున్నది. 1927 సంవత్సరమున యీగ్రామమున కలరావ్యాధి వ్యాపించి జనులను తల్లడిల్లజేసిన సమయమందు గ్రంథాలయము తరఫున రు 100 లను వెచ్చించి మందులను తెప్పించి ప్రజలకు ఉచితముగా నొసంగబడినవి. ఇట్లుమందుల నొసంగుటలో రాత్రియనక, పవలనక భయమనక, త్యాగమును చూపి శ్రద్ధతీసికొనిన శ్రీయుత కె. వి. సుబ్బారావుగారు ప్రశంసాపాత్రులు.

గ్రంథాలయమునందలి గ్రంథములను సమీపగ్రామస్థులకును, గ్రామస్థులకు స్త్రీ పురుష విచక్షణలేకయే యుచితముగ నొసంగబడును. గ్రంథాలయమునకు వసతిగృహము నొసంగిన కుందా వెంకటసుబ్బయ్య శ్రేష్ఠిగారు వందనీయులు. గ్రంథాలయాభివృద్ధికి తోడ్పడుచున్న ప్రముఖులు శ్లాఘాపాత్రులు.

—పోలూరు సుబ్రహ్మణ్యం.

శ్రీసరస్వతీ నిలయము, తిరుత్తణి. (చిత్తూరుజిల్లా)

ప్రజలయందు విజ్ఞానోత్తేజములను గలిగించుటకు ముఖ్యసాధనములు పుస్తకభాండాగారము లని చెప్పక తప్పదు. అట్టి పుస్తకభాండాగారములు దేశమందనేకముగా విలసిల్లుచు మానవసేవ గావించుచున్నవి. ఈ యూరియందును అట్టి సత్సంకల్పముతో శ్రీ సరస్వతీ నిలయ మను పేర నొకగ్రంథభాండాగారము నెలకొల్పబడి సాగింపబడు

చున్నది. భగవత్సన్నిధానములగు దేవాలయము లెట్లు మనకు ప్రార్థనా మందిరములై భక్తి మోక్షసామ్రాజ్యముల నొసంగుచున్నవో యట్లే గ్రంథభాండాగారములుగూడ సరస్వతీమందిరములై ప్రజాళికి విజ్ఞానసిరి సంపదలను సమకూర్చుచున్నవి ఆంధ్రాంగ్లద్రావిడ గ్రంథములు 600 వరకు గలవు. భాషాభిమానులగు కొందరు యుదారభావముతో కొలదిగ మాసచందాల నిచ్చియు గ్రంథములను, వార్తాపత్రికలను నుచితముగ నిచ్చియు నాదరించుచున్నారు. గ్రంథాలయమును సక్రమ పద్ధతులతో సాగించుటకు ప్రస్తుతము సాధనసంపత్తి చాలక యున్నది. అందరు సహాయముచేయ ప్రార్థితులు.

—బూదూరు రామానుజులు రెడ్డి.

ఉచితము.

నాచే రచింపబడిన 0-8-0 విలువగలిగిన 'నిర్మలానంద' మను శాంతరసప్రధాననాటకమును గ్రంథాలయములకును, విద్యార్థులకును ఉచితముగ నొసంగుచున్నాను. కావలసినవారు క్రింది చిరునామాకు ఖర్చుల నిమిత్తం రు. 0-2-6 తపాల బిళ్ళలను బంపవలెను.

అడ్రసు :—

బులుసు వేంకటరమణయ్య,
రామతీర్థము. (Via) నెల్లిమర్ల,
విశాఖపట్టణంజిల్లా.

విజ్ఞానచంద్రికామండలి, బెజవాడ.

తయారగుచున్న గ్రంథములు:—

౧. ఆంధ్ర సామ్రాజ్యము,
(నడింపల్లి జగన్నాథరావుగారు)

౨. అళియరామరాయలు,
(భావరాజు వేంకట కృష్ణారావుగారు, బి. ఏ., బి. ఎల్.)

౩. ఆంగ్లేయ సామ్రాజ్యస్థాపనము,
(భోగరాజు పట్టాభి సీతారామయ్యగారు, (B.A.M.B.C.M.)

౪. లక్ష్మణరాయ వ్యాసావళి,
(ద్వితీయ భాగము.)

౫. రేఖా గణితము,
(వి. వి. ఎల్, నరసింహాచారిగారు. బి. ఏ., ఎల్. టి.)

౬. "గారిబాల్డి" మహాశయుని జీవితచారిత్రము,
(యేండపాటి హనుమంతరావుగారు)

౭. అమరావతీ స్తూపము,
(కానూరి వీరభద్రేశ్వరరావుగారు. బి. ఏ., ఎల్. టి.)

౮. విద్యుచ్ఛక్తి.
(కే. లక్ష్మణరావుగారు, బి. ఇ., ఆనర్సు.)

౯. సహకారోద్యమము.
(వేమవరపు రామదాసుగారు, బి. ఏ., బి. ఎల్.)

౧౦. జర్మనీదేశ చరిత్ర,
(దాసు త్రివిక్రమరావుగారు, బార్-ఎట్-లా.)

విజ్ఞానచంద్రికా మండలి, బెజవాడ.

అల్లాహో అక్బర్.

విజ్ఞానచంద్రికామండలివారి పోటీపరీక్షయందు

రు 500 లు బహుమతిగన్న చరిత్రాత్మక నవల

'విమల' 'అస్తమయము' 'ధరణికోట' మొదలగు

సుప్రసిద్ధగ్రంథకర్త

భోగరాజు నారాయణమూర్తిగారిచే

రచియింపఁబడి

విజ్ఞానచంద్రికామండలియందు 37 వ కుసుమముగ వెలువడుచున్నది.

దేశాభిమాన సంభరితము; వీరరసపరిపూర్ణము; హిందూ మహమ్మదీయ సన్మైత్రి సంధాయకము; అత్యద్భుత కథాసందర్భ విరాజితము.

విషయసూచిక.

1. ఈ బహుమానము నాది. 2. ఆర్తప్రాణ రక్షణము. 3. కంకణాంకణ మల్లుల పూర్వచరిత్రము. 4. పరామర్శము. 5. కలవరింత. 6. పట్టుబడినవాఁడు ప్రతాపుఁడే. 7. కరుణించిలేఖ్రాను. 8. మాతృకుండము, 9. పహాబత్ఖాను. 10. శోకము. 11. చంద్రవతుఁడు-శక్తిసింగు. 12. బ్రహ్మాస్త్రప్రయోగము. 13. ఉత్సవప్రయత్నములు. 14. విచారములో నవ్వు. 15. దర్బారులోని ఖైదీ. 16. ఐదవపంట. 17. వ్యవధిలేదు. 18. అరణ్యపర్యటనము. 19. రొట్టెముక్క. 20. లాభములేదు సుమా. 21. బంగారు జరీచీర. 22. ఆగ్రాలోని విశేషములు. 23. రాజసింహుఁడు. 24. అల్లాహో అక్బర్. 25. పృథ్వీరాజు-జోసీభాయి. 26. ఆలయములో సంభాషింతురు. 27. రాజసింహుఁడు. 28. గుట్టు చెప్పివేసెను. 29. ప్రతాపుని నూతన కార్యక్రమము. 30. సరోవరతీరము. 31. అగ్రాయందలి యుద్ధప్రయత్నములు. 32. దూరముగాబోయి మాటాడెదరు. 33. జగమల్లుఁడు మూర్ఛిల్లెను. 34. పోల్పకొనలేకపోయిరి. 35. యుద్ధమునాటి వింతలు. 36. ధర్మమే జయము. 37. పరస్పరౌదార్యములు. 38. సమాప్తి.

క్యాలికో బైండు.

వెల చందాదారులకు రు. 1-8-0 ఇతరులకు రు. 1-14-0.

విజ్ఞాన చంద్రికామండలి, బెజవాడ.

మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక	
పుస్తకం సంఖ్య	RSVM01A 139
పుస్తకం పేరు	[illegible]
తారీఖు	7/6/24
ముందు అట్ట	yes
వెనుక అట్ట	yes
మొత్తం పేజీలు	21
పెద్ద సైజు పేజీలు	No
ఖాళీ పేజీలు	No
లేని పేజీలు	No
తయారు చేసినది	Sandhya
పేజీలు విడదీసినది	Sandhya
స్కాన్ చేసినది	Sandhya
పరీక్ష చేసినది	pragathi
పేజీలు పరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
స్కాన్ చెయ్యనివి	
తప్పులు	No
పరిస్థితి	good